క్లుప్తంగా

పెద్దచెరువు కట్టపై వ్యర్థాలు తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

గాలివీడు : మండల పరిధి గోరాన్ చెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దచెరువు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలను శుక్రవారం పంచాయతీ అధికారులు తొలగించారు. పెద్ద చెరువు కట్టపై వేస్తున్న వ్యర్థాలపై సాక్షి పత్రికలో 'వ్యర్థాలు వేసేస్తున్నారు' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు జేసీబీ యంత్రం ద్వారా వ్యర్థాలను తొలగించారు. అయితే ఇప్పటికిప్పుడు తాత్కాలికంగా వ్యర్థాలను తొలగించినా చికెన్ షాపులు, హోటళ్ల నుంచి వెలువడిన వ్యర్థాలను పదేపదే పెద్దచెరువు కట్టపై వేయకుండా ఉండేలా హెచ్చరిక బోర్డులు, జరిమానా విధించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు నిర్వహిస్తున్న నాయకులు

సంబేపల్లె : గత కొద్దికాలంగా గుట్టపల్లె కస్పాలో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని విద్యుత్ సమస్యను ఎదుర్కొనేవారు. శుక్రవారం ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గత వారంలో ఎమ్మెల్యే గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో గ్రామస్తులు సమస్యపై ఫిర్యాదు చేయగా వారం గడువక ముందే సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

ఇఫ్తార్ విందు పుణ్య కార్యం



రాజంపేట టౌన్: భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట టౌన్ : ఇఫ్తార్ మహాపుణ్య కార్యమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, కబ్బడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి చిదానంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఈడిగపాలెం మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన ఉపవాసం ఉన్న వారికి స్వయంగా భోజనం వడ్డించారు. ఇఫ్తార్‌లో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు జెడ్పీ చైర్మన్ ఆధ్వర్యంలో..

రాజంపేట రూరల్ : పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వజ్రం కల్యాణ మండపంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి ఎస్ఎండీ అంజద్ బాషా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ సురేష్‌బాబులు విచ్చేయనున్నారు.

ముస్లింలకు రంజాన్ కానుక పంపిణీ



రంజాన్ కానుక పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : జమ్ జమ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బలరామ రాజు వీధిలో జమ్ జమ్ ఫౌండర్ అత్తర్ జమీల్ ఆధ్వర్యంలో రంజాన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈసందర్భంగా 300 మంది నిరుపేదలకు చీరలతో పాటు నిత్యావసర వస్తువులు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం

లక్కిరెడ్డిపల్లె : మండల కేంద్రంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ బజార్‌లోని రమేష్ ఇంటిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జి, టీవీ, ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ మంటలలో కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే రమేష్ కుటుంబ సభ్యులు వేసవికావడంతో ఇంటి బయట మంచాలు వేసుకొని నిద్రిస్తుండగా ఒక్కసారిగా ఇంటిలో నుంచి మంటలు రావడంతో నిద్రలో ఉన్న రమేష్ అప్రమత్తమై తమ పిల్లలను కాపాడుకున్నాడు. వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. పాత ఇల్లు గంతెలు మిద్దె కావడంతో పైన ఉన్న దంతెలు కూడా మంటల్లో కాలిపోయాయి. కట్టుకున్న బట్టలు తప్ప ఏమి మిగల్లేదని బాధితుడు రమేష్ తెలిపారు. సుమారు రూ. 3 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఆదర్శప్రాయం.. అంబేడ్కర్ జీవితం

- ఊరూరా ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంత్యుత్సవాలు
- పలు చోట్ల ర్యాలీలు, సేవా కార్యక్రమాలు, విగ్రహావిష్కరణలు
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు, ఉపాధ్యాయులు



ఓబులవారిపల్లె: రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని అవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, కడప మేయర్ సురేష్ బాబు

ఓబులవారిపల్లె : డా. బీఆర్. అంబేడ్కర్ దార్శనికతతో ఇవాళ దేశ ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం చిన్నఓరంపాడు అడ్డరోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా విగ్రహాన్ని కొరముట్ల, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ కె.సురేష్ బాబు, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి దళిత సంఘాల నాయకులతో కలిసి అవిష్కరించారు. వైఎస్సార్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చీర్ల దుర్గ నాగేంద్ర సొంత నిధులతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి ప్రభుత్వ విప్ కొరముట్ల మాట్లాడుతూ సువిశాలమైన భారతదేశంలో సమానత్వం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే సాధ్యమైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడ లేని విధంగా అన్ని కులాలకు, మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించి పెద్దపీట వేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ స్వతంత్ర్య భారతదేశ రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రచించారని తద్వార కార్మికులకు, కర్షకులకు, బడుగు బలహీన వర్గల జీవితాల్లో మార్పులు వచ్చాయన్నారు. కడప మేయర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ కొందరివాడిగా అనుకుంటున్నారని ఆయన అందరివాడని అన్నారు. కార్యక్రమంలో నాయిబ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానదయ్య, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు పంజం సుకుమార్‌రెడ్డి ఎంపీపీ చీర్ల నాగమ్మ, ఎంపీడీఓ విజయారావు, తహసీల్దార్ పీర్‌మున్ని సర్పంచ్‌లు మల్లెం ఈశ్వరయ్య, ఎస్సీ జయపాల్‌రెడ్డి, ఆళ్ల ఈశ్వరయ్య, పెంచలయ్య, నరేంద్రరాజు, లౌడి గంగురాజు, మినుకు సుధాకర్, వైస్ ఎంపీపీ గౌరిశంకర్‌రాజు, సుంకేసుల రఫీ, ఎంపీటీసీలు దుర్గప్రసాద్, అమృతాల విజయ్‌కుమార్, హరిబాబు ,మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, దళిత సంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : నియోజవర్గ కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్బంగా శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. పలు సంఘాల దళిత నాయకులు, అభిమానులు అంబేడ్కర్ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద, ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ప్రాంగణాలను పూలమాలలతో అలంకరించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలాలు దళిత నాయకులతో కలిసి ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు డాక్టర్ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో దండు గోపి, దాసరి పెంచలయ్య, బి.పెంచలయ్య, ఎస్.మురళీదర్, రామ్మోహన్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాజంపేట నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని పలు గ్రామ సచివాలయాలలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతేగాకుండా పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దవటంలో దళితలు అంబేడ్కర్ చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి పూలతో అలంకరించి సిద్దవటం దిగువపేట నుంచి పోలీసు స్టేషన్ క్రాస్ రోడ్డు వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓబులయ్య, మాలమహానాడు నాయకులు బత్తెన భాస్కర్, జె. ప్రసాద్, మునిస్వామి, సుధాకర్, చలపతి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో రక్తదాన శిబిరం

రాయచోటి టౌన్ : బడుగు, బలహీన, దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాయచోటి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు విశ్వనాథ నాయక్, జయన్న నాయక్, ఇతర బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని వివిధ గ్రామాలల్లో రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని దేవపట్ల, అంకిరెడ్డిగారిపల్లె, నాగిరెడ్డిగారిపల్లె, ఎస్.సోమవరం, నారాయణరెడ్డి, శెట్టిపల్లె, దుద్యాల, మోటకట్ల, పీఎస్ కాలనీ, సంబేపల్లె, రౌతుకుంట, గున్నికుంట్ల, గురిగింజకుంట, నారాయణరెడ్డి గ్రామాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయాగ్రామల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీరబల్లిలో..

వీరబల్లి (రాయచోటి టౌన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వీరబల్లి మండల కేంద్రంలోని మండల ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డితో కలసి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా మండల పరిధిలోని వంగిమళ్లలోని ఆమూరువాండ్లపల్లెలోని పేదలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్బంగా విజయసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు.



సిద్దవటం: అంబేడ్కర్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న దళితులు

రైల్వేకోడూరు : దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వ్యక్తి అంబేడ్కర్ అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి కొరముట్ల పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, పంజం సందీప్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, తుమ్మల సురేష్, సుధాకర్‌రాజు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, దమ్ము రఘు, సిహెచ్.రమేష్, జనార్దన్‌రాజు, బండారు మల్లి, ఆకేపాటి రంగారెడ్డి, దామర్ల సిద్దయ్య, వెంకటయ్య, ఏడుగ అంజి, వినోద్‌ఖన్నా, బుల్లెట్ శివ, మత్తయ్య, దుర్గయ్య, శంకర, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితర ఉపాధ్యాయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంబేడ్కర్ సర్కిల్ నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు బాణసంచా కాలుస్తూ, చెక్కభజనలతో ఆనందోత్సాహాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

నందలూరులో అన్నదానం

నందలూరు(రాజంపేట) : నందలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్బంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి సచివాలయంలో సర్పంచ్ ముసల్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను సర్పంచ్ ముసల్‌రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: నివాళులర్పిస్తున్న ఏపీయూఎస్ నాయకులు

పుల్లంపేటలో..

పుల్లంపేట : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను శుక్రవారం పుల్లంపేటలోని గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహకుమార్, సుదర్శన్ రెడ్డి, బికె మణి, ఎంపీడీఓ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను మండలంలో శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్, ఎస్సీ హాస్టల్ పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గజమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే బెస్తపల్లిలోని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.

అంబేడ్కర్ గొప్ప దేశభక్తుడు

లక్కిరెడ్డిపల్లె : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం (ఏపీయూఎస్) లక్కిరెడ్డిపల్లె మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నరసింహులు మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్ప సామాజిక సంఘసంస్కర్త, గొప్ప దేశభక్తుడని కొనియాడారు. లక్కిరెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, బీజేపీ కృష్ణలు మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలను పోగొట్టడానికి రాజ్యాంగాన్ని రచించి ప్రజలకు అంకితం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు.

గాలివీడులో..

గాలివీడు : మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు గ్రామ సచివాలయాలలో అంబేడ్కర్ జయంతిని అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ జయంతి వేడుకలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.



రాజంపేట రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, దళిత నాయకులు



రాయచోటి టౌన్: వీరబల్లి మండలంలో చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



రాజంపేట: నందలూరులో అన్నదానం నిర్వహిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు



చిట్వేలి: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న దళిత సంఘం నాయకులు

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి

సిద్దవటం : ప్రజా సంక్షేమ పథకాలకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు మళ్లీ పట్టం కట్టాలని మాధవరం 1, 2, 3 వార్డుల గ్రామ సర్పంచ్ చేపూరి ఓబయ్య అన్నారు. మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా సర్పంచ్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు 5 ప్రశ్నలు వేసి వారి వద్ద నుంచి సమాధానాలను తెలుసుకొని పుస్తకంలో నమోదు చేశారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఇంటి జయమానుల అనుమతులు తీసుకొని స్టిక్కర్‌ను అంటికించి, కరపత్రాలను అందజేశారు.

సంబేపల్లెలో

సంబేపల్లె : మండల పరిధిలోని గుట్టపల్లె పంచాయతీలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్బంగా రాష్ట్రకార్యదర్శి చిదంబరంరెడ్డితో జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి కలిసి ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

రామాపురంలో..


రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామ పరిధిలో యర్రంరెడ్డిగారిపల్లె, తొట్టివారిపల్లె, దేవలంపల్లి, బయారెడ్డిగారిపల్లె హరిజనవాడలో మా నమ్మకం నువ్వే జగనన్న - జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం మండల అధ్యక్షుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యోగాంజనేయరెడ్డి, రాజారెడ్డి, చెన్నారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాగశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శకంర్, ఈశ్వర్‌రెడ్డి, వెంకటరమణ, రామచంద్రయ్య, నాగేశ్వరయ్య, సురేంద్ర, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. తిరిగి 2024 ఎన్నికల్లో జగనన్నను మరోమారు సీఎంగా ఎన్నుకోవాలని అభ్యర్థించారు.

క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

రాజంపేట రూరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ గవర్నర్ ఎంజేఎఫ్ రామచంద్రప్రకాష్ గుప్తా చేతుల మీదుగా నిర్వహించారు. ముందుగా జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ఆర్థిక సహకారంతో కుట్టు మిషన్‌లను మహిళలకు అందజేశారు. క్లబ్ సభ్యుల సహకారంతో ఆర్ఎస్ రోడ్ నందు చలివేంద్రం ఏర్పాటు చేశారు. సెక్రటరీ దండే రవికుమార్ సహకారంతో పాతబస్టాండు వైఎస్సార్ సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రీజీయన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా సహకారంతో మహిళలకు చీరల పంపిణి చేశారు. సేవా కార్యక్రమాలలో అధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు, సభ్యులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, ఎం.రామకృష్ణమనాయుడు, శంకర్‌రాజు, శంకరనాయుడు, ఎస్.నసీరుద్దీన్, నాగేశ్వరచౌదరి, నరసింహరాజు, డాక్టర్ బాలరాజు, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను ఆదర్శంగా తీసుకుందాం

రాజంపేట రూరల్ : అగ్ని ప్రమాదాలు నివారించడంలో తమ ప్రాణాలను సైతం కోల్పోయిన అమరవీరులను ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వర్తించాలని సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ కోరారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాలను అగ్నిమాపక అధికారి పి.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ ముందుగా శివశంకర్ రెడ్డితో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. అదే విధంగా అగ్నిప్రమాదాలలో అశువులు బాపిన అమరవీరులకు నివాళులు అర్పించారు. తదనంతరం కేంద్రంలోని పరికరాలను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్బంగా సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లప్పుడూ చురుగ్గా వ్యవహరించాలన్నారు. అనంతరం అగ్నిమాపక అధికారి పి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ 1944వ సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన 66 మంది అగ్నిమాపక సిబ్బంది అమరులయ్యారన్నారు. అదే విధంగా 476 మంది క్షతగాత్రులయ్యారన్నారు. వీరి జ్ఞాపకార్థం 14వ తేదిన అగ్నిమాపక దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఒలు బీ సత్యరాజు, బీసీఆర్ సుబ్రమణ్యం, పి రవీంద్రబాబు, డిఒలు డి శివయ్య, సి నాగూర్ బాష, ఎఫ్ఎంలు కే రాజేష్, జె శివశంకర్, హోం గార్డులు సి రవీంద్రబాబు, జి చక్రవర్తి, యు రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ అహమ్మద్‌ఖాన్, ఫైర్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి

నవరత్నాలతో సకల జన సంక్షేమం

- గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలతో సకల జనుల సంక్షేమం జరుగుతోందని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నమండెం మండలం సి.పాలిమేరపల్లె గ్రామంలోని బెస్తపల్లె, కాయలవాండ్లపల్లె, సి.పాలిమేరపల్లెలలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సమస్యలపై ఆరా తీశారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

సమస్యల పరిష్కారానికి ప్రజలతో శ్రీకాంత్‌రెడ్డి మమేకమయ్యారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విని వాటి పరిష్కారానికి మార్గం చూపుతున్నారు. బెస్తపల్లెలో తాగునీటి పైపులైన్లను త్వరలో ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బెస్తపల్లెలో దరఖాస్తు చేసుకున్న గృహ యజమానులకు త్వరితగతిన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. సి.పాలిమేరపల్లెలో రూ.10 లక్షలతో డ్రైనేజీ పనులను చేయిస్తామని శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు హామీ ఇచ్చారు. అలానే గ్రామంలో నూతన బోరు, పైపులైన్లు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకేష్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నిరంజన్‌రెడ్డి, జేసీబీ శేఖర్, మురళి, మండల ఉపాధ్యక్షుడు ఏజాజ్ అలీఖాన్, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, చుక్కా అంజనప్ప, సర్పంచులు నజీర్ అహమ్మద్, దామోదర్, జగన్నాథరెడ్డి, ఎంపీటీసీలు రమేష్, రెడ్డప్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నమండెం: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఇఫ్తార్ విందులో..

ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసం రంజాన్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండల కేంద్రంలోని జామియా మసీదులో వైఎస్ఆర్‌సీపీ నాయకుడు షేక్ సాదిక్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ నజీర్, షారుల్లా, గౌస్‌సాబ్, బుర్హాన్‌ఖాన్, జహీర్‌ఖాన్, యాహియఖాన్, దౌలత్, సైబకాతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా అభివృద్ధి పనుల పరిశీలన

రాయచోటి : పట్టణ పరిధిలోని మాండవ్య నది ఒడ్డున ఉన్న హజరత్ జమాలుల్లా బాషా ఈద్గా అభివృద్ధి కోసం రూ. 10 లక్షలు ఎంపీ నిధులతో చేపట్టిన పనులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారం శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్థానిక మైనార్టీలతో కలిసి ఈద్గాను పరిశీలించారు. ఎంపీ నిధులతో ఈద్గా సుందరంగా రూపుదిద్దుకుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

16న ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణాన్ని ఎంపిక చేశారు. ప్రాంగణాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు.

ప్రభుత్వ ఆసుపత్రికి ఐసీయూ బెడ్ వితరణ

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ. 30 వేలు విలువజేసే ఐసీయూ బెడ్‌ను ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శ్రీనివాసులురెడ్డికి శుక్రవారం అందజేసినట్లు దాత జమీల్ బాషా తెలియజేశారు. కీ.శే.లు అహ్మద్ బాషా జ్ఞాపకార్థం తన కుమారుడు జమీల్ బాషా ఆసుపత్రికి బెడ్‌ను వితరణగా అందజేసినట్లు వైద్యుడు తెలిపారు.

పరామర్శ

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరామిరెడ్డిని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రారెడ్డి పరామర్శించారు. గత కొద్దిరోజులుగా వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే కోలుకున్నారు. ప్రస్తుతం ఆయన మండలంలోని పాన్నేళ్ళవాండ్లపల్లెలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రవీంద్రారెడ్డి శుక్రవారం ఆయనను పరామర్శించారు.



వెంకటరామిరెడ్డితో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

దళితులకు టీడీపీ చేసింది శూన్యం

వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు దండు గోపి

రాజంపేట టౌన్ : దళితులకు టీడీపీ చేసింది ఏమీ లేదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి పేర్కొన్నారు. స్థానిక అర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులు, వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని దళితులు తొలి నుంచి వైఎస్ కుటుంబం వెంటే నడుస్తున్నారన్నారు. నారా లోకేష్ తన పాదయాత్రలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే దళితులకు న్యాయం జరిగిందని చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుల సంక్షేమానికి ఎవరు కృషి చేశారో చర్చించేందుకు నారా లోకేష్ తేదీ, సమయం, స్థలం నిర్ణయిస్తే అక్కడికి వస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన దాడులను దళితులు ఎప్పటికీ మరువరని గుర్తు చేశారు. దీంతో దళితుల ఓట్లను టీడీపీకి పడవన్న ఉద్దేశంతో లోకేష్ అసత్య ప్రచారాలతో పాదయాత్ర సాగిస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

లక్కిరెడ్డిపల్లె : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి అగ్నిమాపక అధికారి బాల హుసేనయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లక్కిరెడ్డిపల్లె అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మొదటిరోజు అగ్నిప్రమాదంలో మరణించిన వారిని స్మరిస్తూ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్బంగా అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మానవత చైర్మన్ బాల సుబ్రమణ్యం, మనోహర్‌రెడ్డిలు సిబ్బందితో కలిసి ప్రజలకు అందజేశారు.



కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న సిబ్బంది

చీరల పంపిణీ

పుల్లంపేట : పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి కుమారుడు ముద్దా రామసుబ్బారెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని ప్రకాశం కాలనీలోని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తన కుమారుడు ముద్దా రామసుబ్బారెడ్డి పుట్టినరోజున పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని ముద్దా బాబుల్ రెడ్డి తెలియజేశారు.